## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చార్మినార్:** టీఎస్ఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ అప్జల్‌బాబా ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్ఎం గూడా ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, షాలిమార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, జనప్రియ ఓహెచ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**అఫ్జల్‌గంజ్:** 11 కే.వీ విక్టరీ ప్లే గ్రౌండ్, ఇసామియా బజార్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని విక్టరీ ప్లే గ్రౌండ్, ఇసామియా బజార్, గుజరాతీగల్లి, ఆర్టీసీ కాంప్లెక్స్, ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కోఠి, ప్రసూతి ఆసుపత్రి విద్యుత్ ఫీడర్ పరిధిలోని ప్రసూతి ఆసుపత్రి, డీఎంహెచ్ఓ కార్యాలయం, సీబీఐ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11కే.వీ కుతుబీగూడ, గణేష్ దేవాలయం విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కుతుబీగూడ, సుప్రభాత్ హోటల్, గణేష్ దేవాలయం, జీహెచ్ఎంసీ క్వార్టర్స్, చాదర్‌ఘాట్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

# పారిశుద్ధ్యం జాడేదీ ?

**దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు ■ రోజుల తరబడి వ్యర్థాల నిల్వ ● పట్టించుకోని అధికారులు**

**గోల్కొండ:** కార్వాన్ నియోజకవర్గం గోల్కొండలో పారిశుద్ధ్య పనులు అటకెక్కాయి. పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించే అధికారులు జాడెక్కడని.. ? ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పారిశుద్ధ్య పనులు సరగ్గా నిర్వహించడంలేదనే విమర్శలున్నాయి. గోల్కొండ, టోలిచౌకీ డివిజన్‌లలో గత కొద్ది రోజులుగా చెత్తను తరలించే సిబ్బంది, చెత్త తరలింపు పనులను పర్యవేక్షించే అధికారులు పత్తాలేకుండాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. టోలిచౌకీ చౌరస్తా, ఎండీలైన్స్, గోల్కొండ మోతీదర్వాజ, గోల్కొండలోని రేతిగల్లి తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలు రోజుల తరబడి అలాగే ఉంటున్నాయి.

◆ ప్రార్థన స్థలాలు, ప్రభుత్వ పాఠశాలల ముందు చెత్త పరిస్థితి దారుణంగా తయారైందని, గోల్కొండ బడాబజార్‌లోని ప్రభుత్వ పాఠశాల ఎదుట వ్యర్థాలు రోజుల తరబడి ఉండటంతో డంపింగ్ యార్డును తలపిస్తోంది.

◆ గతంలోనే దీనిపై అధికారులతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి ఫిర్యాదు చేసిన దాఖలాలున్నాయి. గోల్కొండ రేతిగల్లిలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణ వద్ద రోడ్డుపై గత కొద్ది రోజులుగా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. పాఠశాల విద్యార్థులు సైతం ఉదయం పూట తమ పాఠశాలకు వచ్చే సమయానికి గేటు ముందు చెత్త ఉంటుందని విద్యార్థులు చెబుతున్నారు. ఇకనైనా పారిశుద్ధ్య నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.


గోల్కొండ దర్గా ఎదుట చెత్తాచెదారం ఇలా..


పారిశుద్ధ్య కార్మికులతో ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

### కార్మికులకు అండగా ఉంటాం..

**గోల్కొండ:** బల్దియాలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు తాను అండగా ఉంటానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రజాసేవ చేసే వారి జాబితాలో మొదటిస్థానంలో ఉంటారన్నారు. రాత్రిపూట, తెల్లవారుజామున విధులు నిర్వహించే కార్మికులు తరచూ ప్రమాదాల బారినపడుతుంటారన్నారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైన పారిశుద్ధ్య కార్మికులను ఎందరినో చూశానని వారికి అండగా ఉంటూ వారికి కావాల్సిన సహాయ సహకారాలు అందించానన్నారు. పనిగంటల సమయంలో తాను ఎన్నోసార్లు అధికారులను నిలదీశానన్నారు. వారికి సరైన వేతనం అందడంలేదని అభిప్రాయపడ్డారు.

## పాతబైలా ప్రకారమే మేరు సంఘం ఎన్నికలు


వెంకటేశ్వర్‌రావు

**చార్మినార్:** రాష్ట్ర మేరు సంఘం ఎన్నికలు వచ్చే నెల 18న జరగనున్నట్లు రాష్ట్ర మేరు సంఘం హడ్ హక్ కమిటీ కన్వీనర్ ఆడపా వెంకటేశ్వర్‌రావు తెలిపారు. దారుషిఫాలోని మేరు సంఘం రాష్ట్ర హడ్‌హక్ కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేరు సంఘం సమావేశంలో కమిటీ ఎన్నికలు పాత బైలా ప్రకారం నిర్వహించేందుకు కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు. ఎన్నికల విధివిధానాలు, షెడ్యూల్‌ను ఎన్నికల అధికారులు త్వరలో ప్రకటిస్తారన్నారు. కొవ్వూరు భాస్కర్‌రావు, పాడిశెట్టి నర్సింగ్‌రావు, తాళ్ల వెంకటేశ్వర్‌రావు, ఎస్.బీ సంగేవార్, దీకొండ నర్సింగ్‌రావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

## స్వామి వివేకానంద సేవా పురస్కారం


సుధాకర్

**చార్మినార్:** ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆసుపత్రిలో గత 30 ఏళ్లుగా హెర్బలిస్టుగా వైద్య విద్యార్థులకు సేవలు అందిస్తున్న పాతబస్తీ లాల్‌దర్వాజకు చెందిన సోసాని సుధాకర్‌ముదిరాజ్ నవభారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ద్వారా స్వామి వివేకానంద సేవా పురస్కారం-2024కు ఎంపికయ్యారు. ఈ మేరకు సంస్థ చైర్మన్ బుత్తల హేమంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని అందజేస్తామన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో ఉజ్వల భవిష్యత్తు

**గోల్కొండ:** ఆధ్యాత్మిక విషయాలపై పిల్లలకు చిన్నతనం నుంచే అవగాహన కల్పిస్తుండాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఉదయం ఆయన టోలిచౌకీ మెజిస్టిక్ గార్డెన్‌లో అహ్లే సున్నత్ వెల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో 40 రోజుల పాటు నమాజ్ ఆచరించిన పిల్లలకు సైకిళ్లను అందించారు. పిల్లలకు దైవభక్తి పట్ల అవగాహన కల్పించడానికి పిల్లలను ఉత్సాహపరచడం ఒక గొప్ప విషయమని ఈ విషయంలో అహ్లే సున్నత్ వెల్ఫేర్ సోసైటీ బాగా పనిచేస్తున్నారన్నారు. 40 రోజుల పాటు పిల్లలు రోజూ 5 పూటల నమాజ్ ఆచరించడం వల్ల పిల్లల జీవితాల్లో నూతన ఉత్తేజం వస్తుందని అభిప్రాయపడ్డారు. అహ్లే సున్నత్ వెల్ఫేర్ సోసైటీ ప్రతినిధులతో పాటు నానల్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ తదితరులున్నారు.

## అయోధ్యకు 'మార్గం' సుగమం

**గోల్కొండ:** అయోధ్య శ్రీరామ ఆలయ దర్శనానికి శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్రం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, గుడిమల్కాపూర్ బీజేపీ అధ్యక్షులు సునీల్‌యాదవ్‌లు తెలిపారు. ఈనెల 31న రైలు ద్వారా రామభక్తులను తీసుకెళ్తామని శ్రీరామ ఆలయ దర్శనం అనంతరం ఫిబ్రవరి 2న తిరుగు ప్రయాణం ఉంటుందన్నారు. రైలు రవాణా ఖర్చులు రూ.2 వేలు ఉంటాయని, అయోధ్యలో భక్తులకు ఉచిత భోజనం, ఉచిత వసతి ఉంటుందని వివరించారు. అయోధ్య ప్రయాణానికి వచ్చే వారు తమను సంప్రదించాలని కోరారు.

## బ్రాహ్మణ వ్యాపారుల అభివృద్ధికి తోడ్పాటు


మాట్లాడుతున్న నరేందర్ కుమార్ కామరాజు

**సుల్తాన్‌బజార్:** బ్రాహ్మణ వ్యాపారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వారి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నామని సనాతన ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (ఎస్ఈఏ) చైర్మన్ నరేంద్రకుమార్ కామరాజు అన్నారు. బ్రాహ్మణ వ్యాపారవేత్తల సంఘం, రెగ్యులర్ నెట్‌వర్కింగ్ మీట్‌లు, ఎగ్జిబిషన్‌లు, జాబ్‌మేళాలు, బిజినెస్ గైడెన్స్ సెమినార్‌లను నిర్వహించడం ద్వారా సభ్యుల ప్రయోజనం కోసం 2018లో స్థాపించబడిన ఎస్ఈఏ తెలంగాణ, ఏపీ, కర్ణాటకలో పనిచేస్తుందని తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.. ఎస్ఈఏ మహిళా వ్యాపారవేత్తల కమిటీ నేతృత్వంలో ఒక ప్రత్యేక మహిళా విభాగాన్ని కలిగి ఉందన్నారు. యువ వ్యాపారవేత్తల కోసం ఒక ప్రత్యేక స్టార్టప్ వింగ్‌ను ప్రారంభించాలని, సంభావ్య పెట్టుబడిదారులతో నెట్‌వర్క్‌లో సహాయ పడాలని ప్రతిపాదించిందని తెలిపారు. ఎస్ఈఏ 2023లో తన సభ్యుల ప్రయోజనం కోసం ఇండో కెనడియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్‌తో ఒక సమావేశాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. ప్రతి ఏటా ఎస్ఈఏ తన వార్షికోత్సవ డైరీని ప్రచురిస్తుందని, ఈసారి 6వ వార్షికోత్సవ డైరీని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్బాబు ప్రభుత్వ బ్యూరోక్రాట్‌లు, ప్రముఖ వ్యాపారవేత్తలు, ప్రముఖులతో కలిసి నగరంలోని పార్క్‌హయత్‌లో ఆవిష్కరించనున్నట్లు ప్రకటించారు. ఎస్ఈఏ అధ్యక్షుడు ఆర్‌సీ.మూర్తి, వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ శ్రీనివాస్ పీసపాటి, వ్యవస్థాపక అధ్యక్షుడు, సలహా మండలి సభ్యులు ఎస్.బీ.రామ్, మురళీధర్ ఆదిరాజు, మహిళా విభాగం వైస్ ప్రెసిడెంట్ రామ అయ్యగారి, మహిళా విభాగం కార్యదర్శి స్వర్ణ మంజీర గొల్లపూడి తదితరులున్నారు.

## ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌కు సత్కారం


సత్కరిస్తున్న ఆర్.కే.జైన్, ప్రవీణ్ వానిగోటలు

**అబిడ్స్:** కాంగ్రెస్ పార్టీ నూతన ఎమ్మెల్సీగా ప్రకటించబడిన రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఆల్ ఇండియా ఓల్డ్ టెంపుల్ రినోవేషన్ ట్రస్ట్ చైర్మన్ ఆర్.కే. జైన్, ప్రముఖ జైన సంగీత విద్వాంసుడు ప్రవీణ్ వనిగోట జైన్‌లు మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు. చేతన మంచ్‌కి చెందిన జైన్ ముఖేష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి


వ్యవసాయశాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రీ:** రైతుబంధు, రుణమాఫీ, వ్యవసాయ యాంత్రిక పరికరాలపై సబ్సిడీని తక్షణమే విడుదల చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మర్చా ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని వ్యవసాయశాఖ కమిషనరేట్ కార్యాలయం ఎదుట రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షలలోపు వ్యవసాయ రుణమాఫీని చేస్తామని చేసిన ప్రకటన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని సూచించారు. గత పదేళ్లుగా గత ప్రభుత్వం వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులపాలు చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వమైనా రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

## కనుల పండువగా సీతారాముల కల్యాణోత్సవం


మాట్లాడుతున్న మాధవిలత

**చార్మినార్:** ఈనెల 22న, అయోధ్యలో జరగనున్న రామమందిర ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకుని లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి చార్మినార్‌లోని చార్‌కమాన్‌లో సీతారామ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అంతకుముందు చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల విగ్రహాలను పల్లకిలో సామూహిక ఊరేగింపుగా తీసుకొచ్చారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని శాసనసభ నియోజక వర్గాల్లో వరుసగా ఆరు రోజులపాటు స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మాధవిలత తెలిపారు. బీజేపీ నాయకులు డాక్టర్ సరితా అగర్వాల్, పవన్‌మిశ్రా, అనీల్‌బజాజ్, నీరజ్ అగర్వాల్, పంకజ్ అగర్వాల్, గౌరీశంకర్ సోనీ, రేణుసోనీ, మేఘారాణి అగర్వాల్ దంపతులు పాల్గొన్నారు.

## రంగనాయక స్వామి ఆలయంలో రంగోళి పోటీలు


పోటీల్లో పాల్గొన్న మహిళలు

**గోల్కొండ:** మహిళలు ఎంతగానో ఇష్టపడే పండుగల్లో సంక్రాంతి ఒకటని నానల్‌నగర్ తిరుపల్లిగడ్డలోని శ్రీ కోవెల రంగనాయక స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో మహిళల కోసం రంగోళి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఎంతో పురాతన చరిత్ర గల ఈ ఆలయానికి పూర్వవైభవం సంతరించుకునేందుకు అధికారుల సాయంతో గత పదేళ్లుగా కృషి చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగానే సంక్రాంతి జాతర నిర్వహిస్తున్నామని, ఆలయ కమిటీ మాజీ సభ్యులు సైతం ఆలయ అభివృద్ధికి తమ సహకారం అందిస్తున్నారన్నారు. రంగోళి పోటీల్లో గెలిచిన మహిళలకు ఆయన బహుమతులను అందజేశారు. ఆలయ అభివృద్ధి మాజీ సభ్యులు, భక్తులతో కలిసి ఆలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన కోనేరును పరిశీలించారు. ఈ నీటిలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, ఈ నీటితో స్నానం చేసిన వారికి చర్మరోగాలు దూరమవుతాయన్నారు. త్వరలోనే ఈ గుండానికి మరింత అభివృద్ధి చేస్తామని వివరించారు. ఆలయ కమిటీ మాజీ సభ్యులు నర్సింహ్మా, సోమారపు జనార్ధన్, జగన్నాథం, అశోక్‌కుమార్, శ్రీకాంత్, విజయబాబు తదితరులున్నారు.

## పక్షిని రక్షించిన పోలీసులు



**నాంపల్లి:** చైనా మాంజాకు చిక్కుకున్న ఓ గద్దను ప్రాణాలతో పోలీసులు రక్షించారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు పర్యవేక్షణలో చెట్టు కొమ్మల మధ్య చిక్కుకున్న గద్దను కాపాడారు. నాంపల్లి ఏరియా ఆసుపత్రి వెనుక వైపు ఉన్న సుబ్బారావు మెకానిక్ షాపు సమీపంలో ఓ చెట్టు కొమ్మకు దారం తగులుకున్న గద్ద చిక్కుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ సిబ్బంది సాయంతో గద్దను రక్షించారు. అనంతరం దాన్ని జూపార్కు అధికారులకు అప్పగించారు. గద్దను రక్షించిన ఇన్‌స్పెక్టర్, సమాచారం ఇచ్చిన త్రిమూర్తి పిళ్లైను స్థానికులు అభినందించారు.

## నిరంతరం సాంస్కృతిక కార్యక్రమాలు


వనం ఉష

**అబిడ్స్:** అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనకు విచ్చేసే సందర్శకులను అలరించేందుకు ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ వీఐపీ క్లబ్ రిసెప్షన్ కమిటీ కన్వీనర్ కల్చరల్ కమిటీ సభ్యురాలు వనం ఉష పేర్కొన్నారు. రోజూ నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈ సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నడిచే వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరుస్తారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేస్తామన్నారు. కూచిపూడి భరతనాట్యం గజల్ ముషాయిరా వంటి కార్యక్రమాలను నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ఎగ్జిబిషన్‌కు విచ్చేసే సందర్శకులు పెండాల వద్ద ఈ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించాలని కోరారు.

## కోటమైసమ్మ దేవాలయ కేలండర్ ఆవిష్కరణ


ఆవిష్కరిస్తున్న గాజుల అంజయ్య

**చార్మినార్:** ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలు పూర్తి సమాచారంతో రూపొందించిన వార్షిక కేలండర్ అమ్మవారి భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని మీరాలంమండి మహాకాళేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య అన్నారు. కోట్ల అలీజాలోని కోట మైసమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షులు రాయికోట్ బాబురాజా రూపొందించిన కోటమైసమ్మ దేవాలయం-2024 వార్షిక కేలండర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈసారి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నామన్నారు. బీజేపీ నాయకులు శ్రీధర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గడువుకు ముందే డాటా ఎంట్రీ పూర్తి


పరిశీలిస్తున్న సర్కిల్-9 డీసీ సరిత


దరఖాస్తులను భద్రపరుస్తున్న దృశ్యం

**చార్మినార్:** జీహెచ్ఎంసీ చార్మినార్ సర్కిల్-9 పరిధిలో ప్రజాపాలన సందర్భంగా అభయహస్తం దరఖాస్తు ఫారాల డాటా ఎంట్రీ పూర్తయిందని సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎల్.సరిత తెలిపారు. మొఘల్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో డాటా ఎంట్రీ తుది నివేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చార్మినార్ నియోజకవర్గ పరిధిలోని పత్తర్‌గట్టి, ఘాన్సీబజార్, పురానాపూల్, శాలిబండ, మొగల్‌పురా తదితర 5 మున్సిపల్ డివిజన్‌ల నుంచి 61,497 దరఖాస్తులు అందాయన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా తమకు ఇచ్చిన గడువులోపే డాటా ఎంట్రీని పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.

**నాంపల్లి:** ప్రజాపాలనలో వచ్చిన అభయహస్తం గ్యారంటీ దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. మెహిదీపట్నం సర్కిల్-12 పరిధిలోని దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు గడువు కంటే ఒకరోజు ముందే పూర్తి చేశారు. ఈనెల 17లోగా దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. గడువులోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తికావడంతో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులన్నింటినీ ట్రంకు పెట్టెల్లో భద్రపరిచారు. నాంపల్లి నియోజకవర్గంలోని 7 డివిజన్లలో మొత్తం 28 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా ఈ కేంద్రాల నుంచి 87,339 దరఖాస్తులు వచ్చాయి. గ్యారంటీలతో పాటు రేషన్‌కార్డులు, డబుల్‌బెడ్రూం ఇళ్లకు చెందిన దరఖాస్తులు అధికంగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీటన్నింటినీ మెహిదీపట్నం సర్కిల్ కార్యాలయంలో భద్రపరిచినట్లు ఇన్‌చార్జ్ డీసీ చంద్రశేఖర్ పేర్కొన్నారు.

## అధికారులు బాధ్యతగా పనిచేయాలి


కాంగ్రెస్ నేత కృష్ణ

**గోల్కొండ:** ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యాన్ని వదిలి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ బంజావాడిలో మాట్లాడుతూ.. పదేళ్లుగా గత ప్రభుత్వ హయాంలో అధికారులు అత్యంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహించారని ఆరోపించారు. ఈసారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, అధికారులు ప్రజాసేవకే ఉన్నారన్న విషయం అధికారులు తెలుసుకోవాలన్నారు. అధికారులు నిర్ధారిత సమయంలో తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

## ఆరేళ్ల బాలుడిపై కుక్క దాడి

**సరోజిని కంటి ఆసుపత్రిలో చికిత్స**

**గోల్కొండ:** కంటిపై కుక్క కరిచిన ఓ బాలుడు మెహిదీపట్నంలోని సరోజిని కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెదక్ పట్టణానికి చెందిన సాకిర్ ఆరేళ్ల కుమారుడు తైమూర్ బుధవారం ఇంటి ముందు వీధిలో ఆడుకుంటుండగా.. కుక్క వెంబడించింది. భయంతో పరుగులు తీసిన తైమూర్‌పై కుక్కదాడి చేసి కరిచింది. ఈ క్రమంలో తైమూర్‌కు కుడి చెంపతో పాటు కుడి కంటిపై తీవ్ర గాయమైంది. ఈ విషయంపై సాకిర్ మెదక్ పట్టణానికి చెందిన మజ్లిస్ నాయకులతో సంప్రదించగా.. స్థానిక మజ్లిస్ నాయకులు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో మాట్లాడారు. కాగా ఎంపీ రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి క్రిస్టినాచోంగ్తుతో మాట్లాడారు. వెంటనే ఆ బాలుడిని మెహిదీపట్నంలోని సరోజిని కంటి ఆసుపత్రిలో చేర్చాలని ఆమె సూచించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ ఆ బాలుడిని చికిత్స నిమిత్తం సరోజిని దేవి కంటి ఆసుపత్రిలో చేర్పించారు.

## వైభవంగా ప్రత్యేక పూజలు చేసుకోవాలి

**22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ**


మాట్లాడుతున్న మజ్జిగ రమేష్

**యాకుత్‌పురా:** శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 22న ఆయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరంలో నిర్వహించే శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా హిందువులు స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించాలని ట్రస్టు చార్మినార్ భాగ్ సంయోజక్ మజ్జిగ రమేష్, సహ సంయోజక్‌లు విశాల్ ప్రసాద్, రామాంజనేయులు, వీహెచ్‌పీ కార్యదర్శి ముఖేష్‌యాదవ్‌లు పిలుపునిచ్చారు. శాలిబండ రాంబక్షీ బండలోని రామాలయంలో ట్రస్టు సభ్యుల అధ్వర్యంలో బుధవారం వారు మాట్లాడుతూ.. నూతన ఆయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో ట్రస్టు ఆదేశాలకు మేరకు చార్మినార్ భాగ్ పరిధిలోని 7 నగరాలు, 54 బస్తీలలో పవిత్రమైన శ్రీరాముని అక్షింతలు పంపిణీని ఈనెల 1 నుంచి 15 తేదీ వరకు విజవంతంగా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో 1782 మంది కార్యకర్తలు, 412 మంది మహిళలు పాల్గొని 96,417 ఇళ్లకు అక్షింతలను పంపిణీ చేశారన్నారు. 22న స్వామివారి ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవం రోజున హిందువులు స్థానిక ఆలయాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కుటుంబసమేతంగా చేరుకుని భజనలు, కీర్తనలు, సంకీర్తనలు, యజ్ఞయాగాలు, శ్రీరామ జయరామ విజయ మహామంత్రం, హనుమాన్ చాలీసా, సుందరా కాండ పారాయణం నిర్వహించాని కోరారు. వీహెచ్‌పీ కార్యనిర్వహక కార్యదర్శి మనోజ్, నాయకులు తదితరులున్నారు.

## సీపీఆర్‌పై అవగాహన

**అబిడ్స్:** గుండె సమస్యలు వచ్చినప్పుడు సీపీఆర్ విధానంతో రక్షించడాన్ని ఎగ్జిబిషన్ సందర్శకులకు అవగాహన కల్పించారు. 83వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనశాల (నుమాయిష్) హెల్త్ సెంటర్ కన్వీనర్ డాక్టర్ సంజీవ్‌కుమార్, అడ్వైజర్ డాక్టర్ జీఎస్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎగ్జిబిషన్ సొసైటీ, యశోదా ఆసుపత్రి వైద్యులు సంయుక్తంగా సీపీఆర్ విధానంపై సందర్శకులకు, స్టాల్ హోల్డర్లకు అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.సంజీవ్‌కుమార్, డాక్టర్ జీఎస్.శ్రీనివాస్‌లు మట్లాడుతూ.. ఎవరికైనా గుండె సమస్యలు వచ్చినప్పుడు, అకస్మాత్తుగా గుండెపోటుకు గురైనప్పుడు ఆ సమయంలో ఉన్నవారందరికీ సీపీఆర్ పట్ల అవగాహన ఉంటే గుండెపోటుకు గురైన వారిని రక్షించవచ్చన్నారు. సందర్శకులకు పెద్దఎత్తున అవగాహన కల్పించామని స్పష్టం చేశారు.


అవగాహనలో పాల్గొన్న డాక్టర్ సంజీవ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాస్

## వ్యక్తి అదృశ్యం


జావేద్ ఉద్దీన్ (ఫైల్)

**గౌలిపురా:** మానసిక వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయిన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మునీరుద్దీన్ కుమారుడు జావేద్‌ఉద్దీన్ (26) 2005 నుంచి మానసిక వ్యాధితో బాధపడుతూ.. ఎర్రగడ్డలోని మెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా ఈనెల 15న ఉదయం 9 గంటలకు జావేద్ ఉద్దీన్ ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంప్రదించాల్సిన నంబరు 040-27854798.

## కుటుంబ సభ్యుల చెంతకు బాలిక

**గౌలిపురా:** తప్పిపోయిన బాలికను భవానీనగర్ పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా గంటల్లోనే గుర్తించి క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హాజీ, షాజహాన్‌ల కూతురు ముస్కాన్ ఫాతిమా (3). మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ముస్కాన్ ఫాతిమా ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు ఆచూకీ కోసం ప్రత్యేకంగా మూడు టీమ్‌లను రంగంలోకి దింపి సీసీ కెమెరాల ఆధారంగా బాలికను గంటల వ్యవధిలో గుర్తించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో ఎస్సై నరేందర్ క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## దోపిడీలకు పాల్పడుతున్న వ్యక్తి రిమాండ్

**చాంద్రాయణగుట్ట:** అర్ధరాత్రి వేళ ప్రజలను బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని చాంద్రాయణగుట్ట పోలీసులు అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి కత్తి, సెల్‌ఫోన్, రూ.1,000 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం అమీనా మసీదు ప్రాంతానికి చెందిన సయ్యద్ వజాహత్ (22) ఏసీ మెకానిక్‌గా పని చేస్తుంటాడు. కాగా సయ్యద్ వజాహత్ గత కొద్ది రోజులుగా ప్రజలను కత్తితో బెదిరింపులకు పాల్పడి డబ్బులు, ఇతర వస్తువులను లాక్కుంటున్నాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం కందికల్‌గేట్ ప్రాంతంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని కత్తి, సెల్‌ఫోన్, రూ.1,000ల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో 7 కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో డీఐ కె.రఘుకుమార్, డీఎస్సై ఎం.ఏ.హుస్సేన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.